ప్రజాశక్తి

బుధవారం 2 అక్టోబర్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ఉమ్మడి కృష్ణాలో 236 మద్యం దుకాణాలు

- ఎన్‌టిఆర్‌లో 113, కృష్ణాలో123 ● గెజిట్ విడుదల
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ ● ఇప్పటికే ప్రక్రియ ప్రారంభం
- 11న లాటరీ ద్వారా కేటాయింపు ● కల్లుగీతలకు10 శాతం షాపులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆయా జిల్లాల ఆబ్కారీశాఖ అధికారులు జి.గంగాధరరావు, ఎస్.శ్రీనివాసరావు మంగళవారం గెజిట్ విడుదల చేశారు. ఈ గెటిట్ ప్రకారం కృష్ణాజిల్లాలో 123, ఎన్‌టిఆర్ జిల్లాలో 113 దుకాణాలకు అనుమతించారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషనుకు అనుగుణమగా 38/2020-24 దాఖలా గెజిట్ జారీ చేశారు. ఈ గెజిట్ ప్రకారం...నూతన మద్యం పాలసీలో విధివిధానాలను ప్రభుత్వం నిర్ధారించింది. జిల్లా కలెక్టర్‌ను సెలక్షన్ అథారిటీగా ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు (తిరిగి చెల్లింపు జరగదు)గా, రిటైల్ గట్టెర్ టాక్స్ నాలుగు స్లాబులుగా నిర్ణయించింది. రెండేళ్ల కాల వ్యవధికి లైసెన్సులు కేటాయిస్తారు. రెండో సంవత్సరం రిటైల్ ఎక్సైజ్ టాక్స్‌పై 10 శాతం పెంపుదలను ప్రతిపాదించింది. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరిస్తారు. అక్టోబర్ 1 నుండి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అన్ని షాపులకు మద్య నిషేధ, అబ్కారీ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరిస్తారు. 11న ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తారు. లాటరీలో ఎంపికైన వారు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం డిపాజిట్ చెల్లించి లైసెన్స్ తీసుకోవాలి. 12వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభించుకునే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లాలో 123 ప్రభుత్వ మద్యం దుకాణాలను నిర్వహించారు. కొత్త పాలసీలోనూ అన్నే దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ దుకాణాలను ప్రైవేటు వ్యక్తులు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేస్తోంది. కృష్ణాజిల్లాలో రెండు స్లాబుల్లో సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తున్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ, గుడివాడ, తాడిగడప మున్సిపాల్టీల పరిధిలో కేటాయించిన మద్యం

దుకాణాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.65 లక్షలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.71.50 లక్షలు డిపాజిట్ చెల్లించాలి. మిగిలిన ప్రాంతాల్లో కేటాయించిన దుకాణాలకు 2024-25లో రూ.55 లక్షలు, 2025-26లో రూ.60.50 లక్షలు డిపాజిట్ చెల్లించాలి.

కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాలు

గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు, బాపులపాడు మండలాలకు ఒక్కో మండలానికి 9 దుకాణాల చొప్పున, మచిలీపట్నం, పెనమలూరు మండలాలకు 8 దుకాణాల చొప్పున అనుమతించారు. గుడివాడ రూరల్ పరిధిలో రెండు దుకాణాలు, పెడన మున్సిపాల్టీలో నాలుగు, పెడన రూరల్‌లో రెండు, ఉయ్యూరు నగర పంచాయతీలో ఆరు, రూరల్‌లో మూడు, తాడిగడప మున్సిపల్ పరిధిలో మూడు, గూడూరు, అవనిగడ్డ, పెదపారుపూడి మండలాల్లో రెండు చొప్పున, బంటుమిల్లి, నాగాయలంక, మోపిదేవి, ఘంటసాల, పమిడిముక్కల మండలాలకు మూడు చొప్పున, కృత్తివెన్ను, మొవ్వ, పామర్రు మండలాలకు నాలుగు చొప్పున, ఉంగుటూరు, పెనమలూరు మండలాలకు ఐదు చొప్పున, కంకిపాడు మండలానికి ఏడు దుకాణాలను కేటాయించారు. మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్‌గా గీత కార్మికులకు కేటాయిస్తారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో 113 మద్యం షాపులు

విజయవాడ ఈస్ట్, విజయవాడ వెస్ట్, భవానీపురం, మైలవరం, తిరువూరు, కంచికచర్ల, నందిగామ, (మిగతా 2లో)

కౌలు రైతులకు రిక్తహస్తం

- అందని వరద సాయం ● కొందరికి ఈక్రాప్ సమస్య

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలో నీటి మూటలుగా మారిపోయాయి. ఎన్యుమరేషన్లో వాస్తవ సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఆచరణకు నోచుకోలేదు. దీంతో వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కనీస ఊరట దొరకలేదు. భూ యజమానులకే పరిహారం దక్కింది. సాగైన పంట వివరాలు ఈ క్రాప్ నమోదవ్వలేదనే కారణంతో కొన్ని ప్రాంతాల్లో రైతులకు పరిహారం అందలేదు. నిబంధనలను సాకుగా చూపి తుది నివేదికలో రైతుల సంఖ్యను ప్రభుత్వం భారీగా కుదించింది. ప్రభుత్వ సాయం నామమాత్రంగానే ఉండటంతో రెండో పంట అపరాల సాగుకు అవసరమైన విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

సగానికి సగం కోత

భారీ వర్షాలు, కృష్ణా, బుడమేర వరదలకు కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో 42,916 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైందని తొలుత వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. తుది నివేదికలో ఐదు ఎకరాల్లోపు విస్తీర్ణాన్ని, 33 శాతం పైబడి నష్టం

వాటిల్లిన 31 రోజులు దాటిన వరి పంటను మాత్రమే పరిగణలోకి తీసుకుంది. ఈనేపథ్యంలో తుది నివేదికలో 21,455 హెక్టార్లలో మాత్రమే వరి పంట దెబ్బతిన్నట్లు చూపారు. దీంతో ప్రభుత్వం 35,472 మంది రైతులకు 53 కోట్లా 63 లక్షల 70 వేల 420 రూపాయలను వారి ఖాతాల్లో జమ చేసింది. 55 రోజుల దశలోని హెక్టారు వరి సాగుకు రూ.62 వేలకుపైగా వ్యయం అవుతోందని, ప్రభుత్వం ఇచ్చే రూ.25 వేలు చాలదని, పరిహారం పెంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోపక్క నిబంధనల కారణంగా ప్రాథమిక నివేదికతో పోలిస్తే తుది నివేదిక అంచనాల్లో నష్టం 21,461 హెక్టార్లు తగ్గింది.

కౌలు రైతులకు పరిహారం నిల్

జిల్లాలో 1.41 లక్షల హెక్టార్లలో వరి సాగవుతోంది. 75 శాతం విస్తీర్ణంలోని పంటలను కౌలు రైతులు సాగు చేస్తున్నారు. 1.25 లక్షల మందికిపైగా కౌలు రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్లు అంచనా. పంటలు ముంపునకు గురికావడంతో అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టి వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతులే ఎక్కువగా నష్టపోయారు. అత్యధికులకు పంట ధృవీకరణ హక్కు పత్రం (సిసిఆర్‌సి) లేదనే కారణంతో భూ యజమాని పేరుతోనే ఎన్యుమరేషన్ చేశారు. దీంతో కౌలు రైతులకు పరిహారం అందలేదు. పంట నష్టపోయి అప్పుల పాలైన తమకు ప్రభుత్వ సాయం అందలేదని కౌలు రైతులు (మిగతా 2లో)

రూ.4.50 లక్షలు అప్పులయ్యాయి

చింతపల్లి నిరీక్షణరావు, కౌలు రైతు, లంకపల్లి, ఉంగుటూరు మండలం

భూ యజమానులు ముగ్గురి నుంచి 18 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.4.50 లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టా. వరదకు మొత్తం మునిగిపోయింది. పంటకు పరిహారం భూ యజమానులకే వెళ్లింది. అప్పులెలా తీర్చాలో తెలియడం లేదు.

నేడు 'సమతా మార్గమా - సనాతన ధర్మమా'పై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు నగరంలోని బాలోత్సవ భవన్లో "సమతా మార్గమా - సనాతన ధర్మమా" అంశంపై ఎంబివికె ఆధ్వర్యాన సదస్సు జరుగుతుంది. ప్రముఖ వైద్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, విశ్రాంత అచార్యులు ప్రొఫెసర్ ఎం.సి.దాస్ పాల్గొంటారు.

సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, ఆనం వెంకట రామ నారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర

దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : మంత్రులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు హోం మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం వెంకట రామ నారాయణరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం మోడరన్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో మంత్రులు సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు దేవస్థానం, మున్సిపల్ అధికారులు చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని), ఎంఎల్‌ఎలు సుజనా చౌదరి, బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ రావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఇఒ రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం దసరా ఏర్పాట్లను కనీవిని ఎరుగని విధంగా చేస్తున్నట్లు చెప్పారు.

మొదటి రోజు 9 గంటల నుండి అనుమతి

ఇంద్రకీలాద్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుండి, ఇతర రాష్ట్రాల నుంచి దుర్గమ్మ దర్శనానికి వచ్చే వారికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు ఉదయం 9 గంలకు ఆలయం తెరచి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. విఐపి దర్శనాలను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు. మొదటి రోజు 9 నుండి 10 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు. పవిత్ర సంగమంలో నవ హారతులు జరుగుతాయన్నారు.

నేడు సిఎం పర్యటన

మచిలీపట్నంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మచిలీపట్నంలో జరిగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్‌పి ఆర్ గంగాధర్ రావు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటనలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్‌ఓ చంద్రశేఖర రావు పాల్గొన్నారు. ముందుగా మంత్రి నారాయణ ఆర్ అండ్‌బి అతిథి గృహంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. నగరలో పార్టీలకతీతంగా అక్రమ కట్టడాల విషయంలో ముందుకెళ్తామని చెప్పారు. కలెక్టర్ డీకే బాలాజీ వివిధ అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తొలుత ముఖ్యమంత్రి నగరంలోని నేషనల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారని, అక్కడి నుండి కళాశాల బయట స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్తాచెదారాలను తొలగిస్తారని తెలిపారు. తదుపరి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి, నగరంలో మూడు స్తంభాల సెంటరు, కోనేరు సెంటర్ మీదుగా టిటిడి కళ్యాణ మండపం చేరుకుంటారన్నారని పేర్కొన్నారు. కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సఫాయీ కర్మ చారి పారిశుద్ధ కార్మికులతో కాసేపు ముఖాముఖి మాట్లాడి దుస్తులు, రక్షణ పరికరాలు అందజేస్తారని వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ చంద్రశేఖర రావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిపిఓ అరుణ, ఆర్ అండ్ బి అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

3 నుండి డ్రైన్ల వ్యవస్థపై ఉమ్మడి తనిఖీలు

●ఎంపి శివనాథ్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ●ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల వరద ముంపుతో విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారని.. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు, శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కషిచేస్తోందని, ఇందులో భాగంగా డ్రెయిన్ల వ్యవస్థపై దష్టిసారించామని, ఈ నెల 3, 4 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ డా. జి.సజన తెలిపారు. మంగళవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.సజన, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకష్ణ ప్రసాద్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర.. విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రెవెన్యూ, మునిసిపల్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో రైల్వేతో ముడిపడిన ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఎస్టేట్ సెక్షన్ల అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు మ్యాన్‌హోళ్ల వద్ద తేలియాడే చెత్తాచెదారం తొలగింపు, సుందరీకరణ, సీసీ అప్రోచ్, ఆర్‌వోబీ/ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. వర్షాల సమయంలో నీరు సజావుగా పారేందుకు వీలుగా డ్రెయిన్లలో పూడికను యుద్ధప్రాతిపదికన తీసేందుకు రైల్వేతో పాటు వివిధ శాఖల సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైల్వే వంతెనల వెంట్స్ వద్ద ఉన్న అడ్డంకుల తొలగింపు, సీవరేజ్ పైపుల నిర్వహణపైనా చర్చించారు. విస్తత ప్రజాప్రయోజనాలను దష్టిలో ఉంచుకొని జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రైల్వే అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాల్సి ఉందని ఎంపీ శివనాథ్ అన్నారు. అదే విధంగా రైల్వేతో సమన్వయం అవసరమైన పనుల్లో పురోగతిపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. డీసిల్టింగ్, శానిటేషన్ తదితర పనులకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) రూపొందించి, దానిప్రకారం పనులను త్వరితగతిన చేపట్టనున్నట్లు కలెక్టర్ సజన తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో రైల్వేతో ముడిపడిన అంశాల్లో పురోగతి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు ప్రధాన డ్రెయిన్లపై దష్టిసారించామని, విజయవాడ అర్బన్ పరిధిలో రైల్వే, వీఎంసీ, ఆర్ అండ్ బీ, ఏపీసీపీడీసీఎల్, రెవెన్యూ అధికారులతో ఈ నెల 3, 4 తేదీల్లో, రూరల్ పరిధిలో ఈ నెల 7, 8 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహించి, డ్రెయిన్ల స్థితిగతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రతినెలా సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాయనపాడు, కొండపల్లి, ఈలప్రోలు తదితర ప్రాంతాలకు సంబంధించి ఆర్‌వోబీల ప్రతిపాదనలను సమావేశం ముందుంచినట్లు తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారంపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వీఎంసీఅధికారులు పాల్గొన్నారు.

25 పాయింట్లలో మంచినీటి ఏర్పాట్లు

వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : తాగునీటి కోసం 25 ప్రాంతాల్లో పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లో ఉన్న భక్తుల వద్దకే తాగునీటి పంపిణీ చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం వీఎంసి ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన శాఖాధిపతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబ్బందిని పెంచి రెండు పాయింట్లు మధ్యలో ఉన్న భక్తులకు తాగునీటి లోపం లేకుండా వారి వద్దకే పంపిణీ చేయాలన్నారు. 31 ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులతో అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వీఎంసి ఆధ్వర్యాన రథం సెంటర్, వీఎంసి ప్రధాన కార్యాలయం ఎదురుగా, సీతమ్మ వారి పాదాలు, కుమ్మరిపాలెం సెంటర్, పున్నమి ఘాట్, పద్మావతి ఘాట్ వద్ద ఉచిత క్లాక్ రూమ్‌లు, చెప్పుల స్టాండ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి ఎగ్జిక్యూటివ్ రాజేష్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం ఎలక్ట్రికల్ మెయింటినెన్స్ ఎగ్జిక్యూటివ్ సంకురు రాజేష్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి దాసు (72) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. వారం రోజుల క్రితం స్వల్పంగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య హేమలత, ఇద్దరు కుమారులు రాజేష్, రంజిత్, కుమార్తె సుధారాణి ఉన్నారు. దాసు ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులోని దాసు స్వగృహం వద్ద ఆయన మృతదేహాన్ని ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, ప్రింటింగ్ యూనిట్ మేనేజర్ పి.వి.సురేష్‌రాజు, టెక్నికల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మంగళవారం యనమలకుదురు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

నివాళులర్పిస్తున్న సిజిఎం వై.అచ్యుతరావు, మేనేజర్ సురేష్ రాజు

అమెరికాలో నున్న విద్యార్థిని గుండెపోటుతో మృతి

విజయవాడ రూరల్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సమీపంలోని నున్న ప్రాంతానికి చెందిన అవుతు దివ్య (22) అనే యువతి అమెరికాలోని అట్లాంటాలో గుండెపోటుతో మరణించిన విషాద సంఘటన చోటుచేసుకుంది. దివ్య కెఎల్ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఎంఎస్ చదివేందుకు గతేడాది అమెరికా వెళ్లింది. యుఎస్‌లోని అట్లాంటాలో ఆమె బంధువుల వద్ద ఉంటోంది. సోమవారం రాత్రి బంధువులు ఫోన్ చేయడంతో ఆమె మతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. దివ్య తండ్రి అవుతు సురేంద్ర రెడ్డిది రైతు కుటుంబం. వారు నున్నలో నివాసం ఉంటున్నారు. స్థానిక టిడిపి నాయకులు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావుకు సమాచారం అందించారు. దివ్య మతదేహాన్ని భారత్‌కు తీసుకురావడానికి సహకరించాలని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)ని సంప్రదించారు. ఇందుకయ్యే ఖర్చులను ఎమ్మెల్యే కంపెనీ భరించేందుకు ముందుకొచ్చింది. యుఎస్‌లో అవసరమైన పోలీసు విచారణను పూర్తి చేసిన తర్వాత మతదేహం శుక్రవారం లేదా శనివారం నాటికి నున్న చేరుకునే అవకాశం ఉంది.

మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైన్ సాధిస్తా : ఎంపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైన్ సాధించి తిరుతానని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక రహదారులు భవనాల శాఖ అతిది గహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కష్ణా జిల్లా దివిసీమ ప్రజల దశాబ్దాల చిరకాల కోరిక, కల అయిన ఈ రైల్వేలైను నిర్మాణానికి తొలి అడుగు పడిందన్నారు. ఇప్పటికే నర్సాపురం నుంచి మచిలీపట్నం వరకు ఒక రైల్వే లైన్ నిర్మాణానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు తిరువూరు ఎంఎల్ఎ క్షమాపణ

ప్రజాశక్తి - తిరువూరు : చిట్టేల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు, ఆయన భార్య కవిత తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేస్తూ తిరువూరులోని తన కార్యాలయంలో సోమవారం రాత్రి శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు చేపట్టిన నిరవధిక దీక్షను కొద్దిసేపటికే విరమించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సూచన మేరకు ఆయన తన దీక్షను విరమించారు. అలాగే జర్నలిస్టులపై తాను చేసిన ఆరోపణలకు, వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు.

పేరుమార్పు

నేను షేక్ అబ్దుల్, నివాసం : డోర్ నెం.17-18-9, ఫీటర్ స్ట్రీట్, పెజ్జొనిపేట, విజయవాడ. నా కూతురు పూర్వపు పేరు **షేక్ అష్రీమ్ భాను.** ఇప్పుడు కొత్తగా పేరు మార్పు చేసిన తర్వాత **షేక్ అతియ** గా మార్పు చేయటం జరిగినది. నేటి నుండి నా కూతురు పేరు **షేక్ అతియ D/o షేక్ అబ్దుల్ (SHAIK ATIYA D/O SHAIK ABDUL)** గా పిలవబడును.
పుట్టినతేదీ సర్టిఫికెట్‌లో పేరు మార్పు కొరకు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. No. 15/19 in O.S.No. 138/15
Between:
పరింకాయల ఫణికుమార్ .....D.Hr.
And
బడుగు ఉమాదేవి .....J.Dr.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా J.Dr తాలూకు స్థిరాస్తిని పైకోర్టువారి యెదుట ది. 17-10-2024న ఉదయం గం॥ 10.30 ని॥ ల నుండి వేలం వేయబడును. కావున కావలసినవారు వచ్చి సదరు వేలం తేదీన పైకోర్టు వారి యెదుట హాజరై సదరు ఆస్తిని పాడుకొనవచ్చును.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స॥రి॥ వారి యిలాకా మచిలీపట్నం టౌన్, బలరామునిపేట, మున్సిపల్ వార్డు నెం. 10, డోరు నెం. 10/206 రు, ఎసెస్మెంట్ నెం. . 1070002279 రుకు చెందిన ఆర్.సి.సి. డాబా ఇంటి భాగం మరియు రేకుల వసారా ఇంటికి హద్దులు. పై నెంబరు J.Dr యొక్క హక్కు భుక్తములలో ఉండి పై నెంబరు E.P. లో జప్తు కాబడిన షెడ్యూలు ఆస్తి వివరములు.

1వ ప్రతి: తూర్పు: ఇందలి 2వ ప్రతి కొంత, సంక్రాంతి సుధాకర్ గారి బిల్డింగ్ స్థలం కొంత అ. 21.10లు + అ. 12.11లు = అ. 33.21లు, **దక్షిణం:** మున్సిపల్ రోడ్డు అ.13.6లు, **పడమర:** ఇందలి బి. షెడ్యూలు 2వ ప్రతి కొంత అ.21.10లు + అ.12.11లు = అ॥ 33.21లు, **ఉత్తరం:** ఈ రోజున మేము బడుగు చంద్రశేఖర్ గారికి దఖలు పర్చిన ఆస్తి అ॥ 13-6 లు. యీ హద్దుల మధ్య చ॥ గ॥ 32.74లు.

2వ ప్రతి: తూర్పు: సంక్రాంతి సుధాకర్ గారి బిల్డింగ్ స్థలం అ.12.11లు, **దక్షిణం:** సంక్రాంతి సుధాకర్ గారి బిల్డింగ్ స్థలం అ॥ 9.6లు, **పడమర:** ఇందలి 1వ ప్రతి అ॥ 12.11లు, **ఉత్తరం:** ఈ రోజున మేము బడుగు చంద్రశేఖర్ గారికి దఖలు పర్చిన ఆస్తి అ॥ 9.6లు. యీ హద్దుల మధ్య చ॥గ॥ 33లు. 1వ ప్రతి మరియు 2వ ప్రతి వెరశి చ॥గ॥ 65.74లు.

D.Hr. విలువ :Rs. 6,00,000/-
అమీనా విలువ : Rs. 8,00,000/-
మార్కెట్ విలువ :Rs. 13,98,190/-
వేలం తేదీ: **17-10-2024**

మెండు సురేష్ బాబు
మచిలీపట్నం. **D.Hr**. తరపున అడ్వకేట్
ది.01-10-2024 మచిలీపట్నం.

మొదటి పేజీ తరువాయి

కౌలు రైతులకు రిక్తహస్తం

వాపోతున్నారు.

పరిహారానికి చిక్కులు

పంట నష్టం ఎన్యుమరేషన్ చేయడానికి ప్రభుత్వం ఈ క్రాప్, ఈకెవైసిలను ప్రామాణికంగా తీసుకుంటోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ క్రాప్, ఈకెవైసి పూర్తవ్వకపోవడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. చల్లపల్లి మండలం మాజేరులో వరదలకు వరి పొలాలు 15 రోజులు ముంపులోనే ఉన్నాయి. ఎకరాకు రూ.25 వేలకుపైగా పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయారు. 125 ఎకరాలు ఈ క్రాప్ నమోదు అవ్వకపోవడంతో పరిహారం జమకాలేదు. తమకు పరిహారం ఇప్పించాలని రైతులు... జిల్లా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పరిహారం పెంచాలి

గోగినేని రాఘవేంద్రరావు, రైతు, ఆముదాలపల్లి, ఉంగుటూరు మండలం

ఆముదాలపల్లిలో మూడెకరాల సొంత భూమిలో వరి సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.75 వేలు పెట్టుబడి పెట్టా. బుడమేరు వరదలకు పంట మునిగి పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.30 వేలు ఆర్థిక సాయం అందించింది. ఇది ఏమాత్రం చాలదు. పరిహారం పెంచాలి. రెండో పంట సాగుకు అవసరమైన మినుము విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి.

రెండో పంటలో వాటా కావాలని భూ యజమానుల మెలిక

పేరతోటి రాంబాబు, కౌలు రైతు, లంకపల్లి, ఉంగుటూరు మండలం

రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.50 వేలు పెట్టుబడి పెట్టా. బుడమేరు వరదకు మొత్తం దెబ్బతింది. పంట నష్టపరిహారం భూ యజమానికి వెళ్లింది. పరిహారం ఇవ్వాలని భూ యజమానిని కోరా. పరిహారంలో సగం ఇస్తా. రెండో పైరు మినుము పంట పండిన దానిలో సగం వాటా ఇవ్వాలని మెలిక పెట్టారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలి.

ఈ క్రాప్ కాలేదని పరిహారం ఇవ్వలేదు

రాజులపాటి శ్రీనివాసరావు, కొత్త మాజేరు, చల్లపల్లి మండలం

మూడెకరాల్లో వరి సాగు చేశా. భారీ వర్షాలకు వాగులు పొంగి మొత్తం మునిగిపోయింది. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.75 వేలు నష్టం వచ్చింది. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామంది. పంట ఈ క్రాప్ అవ్వలేదని పరిహారం ఇవ్వలేదు.

ఉమ్మడి కృష్ణాలో 236 మద్యం దుకాణాలు

జగ్గయ్యపేట మద్య నిషేధ, అబ్కారీ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈనెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తారు. ప్రకటించిన 113 మద్యం దుకాణాలు కాకుండా కల్లుగీత సామాజిక తరగతుల వారికి 10 శాతం షాపులు అదనంగా కేటాయిస్తారు. వీటికి సంబంధించి విధి విధానాలను త్వరలో ఖరారవుతాయి. ఈ మద్యం షాపులకు వేరుగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

30లోగా ఎపిజిఎన్ఎ ఎన్నికల ప్రక్రియ పూర్తి

ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్ఏ) ఎన్నికల మొత్తం ప్రక్రియను ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా కోఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న తనను ఏపీ జీఎన్ఏ ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర సహకార, సహకార సంఘాల రిజిస్ట్రార్ కమిషనర్ నుంచి తాజాగా మార్గదర్శకాలు అందినట్లు వెల్లడించారు. అసోసియేషన్ బైలాస్, ఏపీ సీఎస్ (ఆర్‌వోఎస్ఏ) నిబంధనలు-2001 ప్రకారం ఉమ్మడి జిల్లాల ఓటర్ల జాబితాతో అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కొమ్మారెడ్డి స్కూల్లో దసరా సంబరాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి స్కూల్లో దసరా సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సాంబశివరాజు అమ్మవారి అవతారాలను వాటి విశిష్టతలను చక్కగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారి వివిధ రూపాలను ప్రదర్శిస్తూ చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకి చదువుతో పాటు మన పండగలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. మెమొరీ మాథ్స్ అకాడమి, హైదరాబాద్ వారు 1 నుండి 5 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన అబాకస్ మాథ్స్ పోటీలలో తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరి అండ్ కరస్పాండెంట్ శోభ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబిఐ) విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం మచిలీపట్నం లోని స్థానిక యూబిఐ ప్రాంతీయ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మరియు యూనియన్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రాంతీయ జనరల్ మేనేజర్ కే వెంకట్రావు, రెడ్ క్రాస్ చైర్మన్ టి ఎస్ ఎస్ బాలాజీ ప్రారంభించారు. యుబిఐ ప్రాంతీయ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రామలింగారెడ్డి విజిలెన్స్ చీఫ్ మేనేజర్ రాము, తాతాజీ, రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్ నాథ్ భవిరి, ట్రెజరర్ రాం బాలాజీ, డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

4న అవనిగడ్డ మండల సమావేశం

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈ నెల నాల్గో తేదీన అవనగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.మరియాదేవి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ తుంగల సమితిదేవి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజేస్తుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మాచవరం రైస్ మిల్ దగ్గర మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపి వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై అవగాహన కలిగించేందుకు వారు సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతంలో మొక్కలు నాటి సుందరీకరణ పనుల కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. ఈ క్రమంలో రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటి ప్రకృతిని సంరక్షించాలని, ప్రతి ఒక్కరూ అన్ని గ్రామాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని మంత్రి కోరారు. ఎంపి బాలశౌరి మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి పోర్టు అనుసంధానం రహదారి, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని హైవే అధికారులకు సూచించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం అవగాహనపై ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖ, వ్యర్థాల నుంచి కళాకృతుల తయారీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు, ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ చీఫ్ ఇంజినీర్ రాకేష్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యం, కూటమి నాయకులు బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: గన్నవరం గాంధీచౌక్ నుండి అగిరిపల్లి రోడ్డులోని సెంటర్ డివైడర్‌పై స్వచ్ఛ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వెంకట కృష్ణ ఆయిల్స్, మురళీకష్ణ సమన్వయంతో గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, పంచాయతీ కార్యాలయంలోని సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమం చేశారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ అధికారులు రాంకిషోర్, తేజన్నా హేమంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

బందరులో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ దీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోనేరు సెంటర్‌లో రిలే నిరాహా దీక్ష చేపట్టారు. దీక్షను సిపిఎం డివిజన్ కార్యదర్శి బి.సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. కర్మాగారంలో పని చేసిన నాలుగు వేల మందికి పైగా కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, తొలగిచిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, అధ్యక్షులు ప్రేమ్, ఉపాధ్యక్షులు కీర్తి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ సాదిక్‌బాబు, నాయకులు కార్తీక్, నాని, సంతోష్, నాంచారయ్య, రాజ్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు సలీం, నాగేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మొవ్వ: అవురుపూడి గ్రామంలో గత నెల 28వ తేదీన నాగులపాటి వీర స్వామి గారి ఇల్లు కాలిపోగా బాధితునికి పామర్రు నియోజవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, మొవ్వ మండల టిడిపి అధ్యక్షులు లింగామనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు లోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాల జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో చిత్రం గ్రామంలో స్వచ్ఛతాహి సేవాకార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా శ్రమదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు చిత్రం గ్రామంలో పరిసరాలు, గ్రామం నుంచి 60 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాన్ని సేకరించి రీసైక్లింగ్ యూనిట్‌కు అందజేశారు. అలాగే ఆ గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ అక్కయ్య ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రతినిధి వినోద్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎస్కే అమీనా భి, డాక్టర్ వి రజిని, జి జయశ్యామల, పి భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పమిడిముక్కల

వరి పంటకు వచ్చే తెగుళ్ల గురించి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పమిడిముక్కల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి అన్నారు. మంటాడ, గురజాడలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

లారీ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మోపిదేవి: దిగమర్రు కత్తిపూడి జాతీయ రహదారిపై మోపిదేవి మండలం పెదప్రోలు బస్టాండ్ దగ్గరలో ఎడ్ల బండిని ఢీకొని లారీ అదుపుతప్పి పంట పొలంలోకి బోల్తా పడింది మంగళవారం ఐదు గంటల సమయంలో రేపల్లె వైపు నుంచి ఖాళీ సంచుల లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తున్న లారీ ఎడ్ల బండి తప్పించే క్రమంలో పల్టీ కొట్టింది కరెంటు స్తంభం కూడా ధ్వంసమై స్తంభం నుంచి కాసారం వేరే దూరంగా తీగలకు వేలాడుతుండడంతో ప్రమాద తీవ్రతను కరెంటు స్తంభం కొంత తగ్గించిందని స్థానికులు చెప్తున్నారు డ్రైవర్ నిద్ర మత్తులో ఆద మరిచిన స్థితిలో ఎడ్ల బండి తప్పించి ప్రాణ నష్టం జరక్కుండా చాకచక్యంగా వ్యవహరించాడు అంటున్నారు. ఎడ్ల బండి మీద ఉన్న కొక్కిలిగడ్డ కొత్తపాలెం

గ్రామానికి చెందిన రమేష్‌కి డ్రైవర్‌కి స్వల్ప గాయాలు తగలడంతో 108 లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోపిదేవి ఎస్సై కె.వి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ: కోసూరు, వేములమడ గ్రామాల్లో అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలని సిపిఎం నాయకులు కోరారు. వేములమడ, కోసూరు గ్రామాల సంయుక్త గ్రామ సిపిఎం శాఖ మహాసభ మంగళవారం కొడాలి శ్రీనివాసరావు అధ్యక్షతన వేములమడ గ్రామంలో నిర్వహించారు. తొలుత గ్రామంలో పార్టీ జెండాను వడ్డే వెంకటేశ్వరావు ఆవిష్కఇరంచారు. అనంతరం అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మహాసభకు జిల్లా కమిటీ సభ్యులు నారాయణరావు హాజరయ్యారు. వేములమడ, కోసూరు సంయుక్త గ్రామాల శాఖ సిపిఎం కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. సభలో పలు తీర్మానాలు చేశారు. వేములమడలో పెద్ద చెరువు నుండి రుద్రవరం వెళ్లే పంట కాలువ మేట తొలగించాలని, సకాలంలో రైతులకు సాగునీరు అందించాలని, మేడూరు ఛానల్ నుండి వేములవాడ వచ్చు పిల్ల కాలువను వెడల్పు చేసి నారుమడుల సీజన్‌లో రైతులకు సకాలంలో నీరు వచ్చేలాగా చేయాలని, వేములవాడలో శ్మశానంకు వెళ్లే రోడ్డును అభివద్ధి చేయాలని, గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సభలో తీర్మానించారు.

బాలసుబ్రహ్మణ్యం

చల్లపల్లి: సిపిఎం మండల శాఖ మహాసభలు ముగిసినట్లు మండల కార్యదర్శి యద్దనపూడి మధు తెలిపారు. శాఖా మహాసభలో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం శాఖ కార్యదర్శిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మాజేరు శాఖ కార్యదర్శిగా వేముల నాగేశ్వరరావు, లక్ష్మీపురం శాఖ కార్యదర్శిగా బండారు కోటేశ్వరరావు, రామానగరం శాఖ కార్యదర్శిగా లంకపల్లి సత్యనారాయణ, చల్లపల్లి లోని మధ్యతరగతి శాఖ కార్యదర్శిగా పజూరుల్లా ఖాన్, చల్లపల్లి నారాయణరావు నగర్ శాఖ కార్యదర్శిగా బళ్లా వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా కొమ్ముకూరి రాజేశ్వరరావు, నడకుదురు శాఖ కార్యదర్శిగా మేడేపల్లి వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ శాఖా కార్యదర్శిగా తలారి నాగేశ్వరరావు, యార్లగడ్డ వీవర్స్ శాఖా కార్యదర్శిగా బట్టు వెంకట్రావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

చిన్నతేరేసమ్మ దేవాలయం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడఅర్బన్ : సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ పరిధిలోని యనమల కుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన పునీత చిన్న తేరేసమ్మ దేవాలయం (చర్చి)ని మంగళ వారం సాయంత్రం విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెంట్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు ప్రారంభించారు. అనంతరం చర్చిలోపల అత్యంతసుందరంగా నిర్మించిన పూజాపీఠంపై బిషప్ జోసఫ్ రాజారావు, తదతర గురువులు నూతనదేవాలయ పున ప్రతిష్టాపన మహోత్సవాన్ని నిర్వహించి సమిష్టి దివ్య పూజాబలి కార్యక్రమాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావు మాట్లాడుతూ యనమలకుదురు గ్రామంలో కథోలిక క్రైస్తవ సంఘం ముందుకువచ్చి విశాలమైన ప్రాంగణంలో చిన్న తేరేసమ్మ దేవాలయం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మధిర బెర్నాడ్ గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కథోలిక క్రైస్తవ సంఘ ప్రతినిధులు గుమ్మడి విజయకుమార్,. గుమ్మడి జీవన్ కుమార్, పల్లి జయరాజు, గుమ్మడి అన్వేషు, బుంగా రాజు, వెలిశెల జోజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్,వన్‌టౌన్ : పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్మెంట్, తాడేపల్లి గల అపార్ట్మెంట్ వాసులు సింగ్నిగర్ లోని లెనిన్ సెంటర్‌లో వరద బాధితులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రెసిడెంట్ ముళ్ళపూడి భగవాన్ మాట్లాడుతూ గత నెలలో వచ్చిన వరదలకు నగర ప్రజలు ఎన్నో కోల్పోయారన్నారు. తామంతా నివసిస్తున్న పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్ తరుపున సుమారు రూ.లక్షన్నర విరాళాలుగా సేకరించుకొని చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలు కొత్తవి కొనుగోలు చేసిన వాటితో పాటు, అపార్ట్‌మెంట్‌లో నివసించే వారి నుండి పాత బట్టలను సేకరించి వరద బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ ముళ్ళపూడి భగవాన్, సెక్రటరీ బలరాం,వైస్ ప్రేసిడెంట్ జ్యోతిర్మయి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎడిసిపిని కలిసిన రామయ్య

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ అడిషనల్ డిసిపి గుణ్ణం రామకృష్ణని జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, 40 డివిజన్ టిడిపి అధ్యక్షులు చిన్న సుబ్బయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి పూలమొక్కను అందచేశారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భవానీపురం ప్రాంతం వచ్చే యాత్రికుల టూ వీలర్ రాకపోకలకు అవకాశం కల్పించాలని కోరారు. దసరా రోజుల్లో దర్శనం త్వరగా అయ్యేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. అడిషనల్ డిసిపిని కలిసిన వారిలో టిడిపి నాయకులు గాలిబ్ షాహిద్, మోహన్, నారాయణ తదితర నాయకులు వున్నారు.

ఇసుక క్వారీలను తెరిపించాలని ధర్నా

వెస్ట్ తహశీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - భవానీపురం : భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు), బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూని యన్ (బిసిడబ్ల్యూయు) సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఇసుక క్వారీలను తెరిపించి అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భవానీపురంలోని పశ్చిమ తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నానుద్దేశించి బిసిడబ్ల్యూయు జిల్లా సహాయ కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా 45 రకాల వృత్తుల్లో 35 లక్షల మంది కార్మికులు ఈ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, కార్యదర్శి హరికృష్ణా రెడ్డి, బిసిడబ్ల్యుయు జిల్లా కార్యదర్శి షేక్ మీరావళి, అధ్యక్షుడు ఎ.వి.రమణ, బ్రహ్మయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కి పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ ఇఓ రామారావు

దసరా ఉత్సవాలకు ఎంపి, పశ్చిమ ఎంఎల్ఎకు ఆహ్వానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుండి జరగనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)ని, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సత్యనారాయణ (సుజనా చౌదరి)ని ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు మంగళవారం వారి కార్యాలయాల్లో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఎంపి, ఎంఎల్ఎకు వేదపండితుల ఆశీర్వదించనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందించారు.

వెండి గిన్నెలు అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మకు కేజీ 270 గ్రాములు బరువు గల వెండి తీర్థపు గిన్నెలను టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ బుద్దా వెంకన్న బంధువులైన కాంద్రేగుల జగదీశ్వరీ మంగళవారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావుకి వెండి గిన్నెలను అమ్మవారి దేవాలయానికి కానుకగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు

అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలి

50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

వికలాంగునికి పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్త పెన్షన్లు గత ఏడాదిగా రాక వేలాదిమంది వృద్ధులు, వితంతు వికలాంగులు ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. మంగళవారం 50వ డివిజన్‌లోని దివ్యాంగునికి పెన్షన్‌ను బోయి సత్యబాబు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారి పెన్షన్లు తప్పుడు కారణాలు చూపి వేలాదిమంది పెన్షన్లు గత ప్రభుత్వం రద్దు చేసిందని ఈ ప్రభుత్వం వస్తే వెంటనే మా పెన్షన్లు ఇస్తుందని ఎదురుచూస్తున్న వారికి నిరాశ మిగల్చడం అన్యాయమని అన్నారు. అనర్హుల పేరు చెప్పి అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వకుండా కాలయాపన చేయడం న్యాయమా అన్నారు. గత ప్రభుత్వం బాటలో పెన్షన్లు తొలగింపునకు ముఖ్యమంత్రి ప్రకటన దోహదం చేస్తుందన్నారు. 100 రోజులైనా కొత్త పెన్షన్లు విడుదల చేయకపోవటం బాధాకరమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తరగతులకు 50 సంవత్సరాలకే పెన్షన్ వాగ్దానం అమలు చేయాలన్నారు. ఒక నెల పెన్షన్ పొందని వారికి మరుసటి నెలలో కూడా కలిపి ఇచ్చే విధానం అమలు చేయాలని కోరారు. రేషన్ కార్డు వెంటనే ఇచ్చే విధానం అమలు చేయాలని, సదరం మెడికల్ సర్టిఫికెట్లు ప్రతినెల మంజూరు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్స్ యూసఫ్, సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఉపేంద్ర, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా విధుల్లో ఉన్న ఆశాలకు అలవెన్సులివ్వాలి

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కమల, తదితరులు

విజయవాడ : దసరా నవరాత్రుల ఉత్సవాల్లో డ్యూటీల్లో పాల్గొనే ఆశా వర్కర్లకు టిఎలు, డి.వి.లు చెల్లించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.కమల అన్నారు. ఆమె మాట్లాడుతూ నగరంలో దసరా నవరాత్రుల ఉత్సవాలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యాత్రికులు పాల్గొంటున్నారని వీరికి ఆరోగ్యపరమైన సేవలందించేందుకు అశా వర్కర్లను 3 షిఫ్టులుగా డ్యూటీలు వేస్తున్నారని అన్నారు. ఆశా వర్కర్లు కూడా కేటాయించినన్ని రోజులు క్రమశిక్షణతో కనకదుర్గ గుడిలో డ్యూటీలు చేస్తున్నారని తెలిపారు. వారంతా ప్రభుత్వం ఇచ్చే పారితోషికం (రూ.10,000/-లు)మీదే ఆధారపడి జీవనం సాగించేవారని, అలాంటి వారికి ప్రతిరోజు గుడి వద్దకు డ్యూటీకి రావడం, వెళ్ళడం ఆర్థికంగా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఏ సంవత్సరం కూడా వారికి ఎలాంటి ప్రయాణపు ఖర్చులు చెల్లించడంలేదని, ఆశా వర్కర్లు వారి సొంత ఖర్చుతోనే డ్యూటీలకు హాజరవుతున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అక్టోబర్ 3 నుండి 13 వరకు జరిగే దసరా ఉత్సవాల్లో డ్యూటీలు చేసే ఆశా వర్కర్లకు టీఏ. డి.ఎ.లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో వారిని దసరా డ్యూటీల నుండి మినహాయించాలని కోరారు.

బయో ఎనర్జీపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రముఖ డిజిటల్ ఫ్లాట్‌ఫారమ్ అయిన బయో ఫ్యూయల్ సంస్థ బయో ఎనర్జీ సరఫరాను విస్తృతం చేస్తున్నట్లు సంస్థ రీజనల్ ఇన్‌చార్జి కె.కరుణ తెలిపారు. నగరంలోని బయో ఫ్యూయల్ సంస్థ రీజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బయో ఎనర్జీ సరఫరా గురించి తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రాలలో బయో ఎనర్జీని వినియోగించే దిశగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే వివిధ ప్రాంతాలలో రైతులకు, స్థానికులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బయో ఉత్పత్తులను పెంచే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు.

శామ్‌సంగ్ ఫెస్టివల్ ఆఫర్

ప్రజాశక్తి - విజయవాడఅర్బన్ : అతిపెద్ద కస్టమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్‌శామ్‌సంగ్ అతి పెద్ద ఫెస్టివ్ సేల్ ఫ్యాబ్ గ్రాబ్ ఫెస్ట్‌ను ప్రారంభించినట్లుసంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.ప్రతాప్ తెలిపారు. నగరం లోని శామ్‌సంగ్ స్టోర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఫెస్టివల్ సేల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఫెస్టివల్ సేల్‌లో గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్స్, ల్యాప్ టాప్‌లు, ఉపకరణాలు, ధరించగలిగిన వస్తు వులు, స్మార్ట్ మానిటర్లు వంటి వాటిపై అద్భుతమైన డీల్స్, క్యాష్ బ్యాక్‌ను అందచేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. శామ్ సంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లలోనూ, అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వరదబాధితులందరికీ సాయమందాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వరద బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందరికీ అందేలా చూడాలని 43 వ డివిజనులో ఏకలవ్య నగర్ వాసుల గోడును ప్రభుత్వం పట్టించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ మంగళవారం డిమాండ్ చేశారు. వరద బాధితులు అందరూ ఆయన ముందు తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో వరదలు వచ్చి ప్రతి ఇల్లు నీటి మునిగి ప్రజలందరూ కూడా తీవ్ర ఇబ్బందులతో పాటు ఆర్థికంగా వారి సామగ్రి మొత్తం పోగొట్టుకొని ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే వరద సాయం కోసం బాధితులు అందరూ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో మా కాలనీవాసులకు 90 శాతం మంది ప్రజలకు వారి అకౌంట్లకు డబ్బులు రాలేదని తమ దృష్టికి తెచ్చారన్నారు. వరద సాయం అందని వారి పేరు, ఫోన్ నెంబర్ తీసుకొని కలెక్టర్‌దష్టికి తీసుకువెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడతానని ఆయన ప్రకటించారు. వరద బాధితులందరికీ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కావాటి కష్ణ, 42 డివిజన్ స్థానిక నాయకులు దశరథ, 43 డివిజన్ స్థానిక నాయకులు దాసరి తిరుపతయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గొట్టుముక్కలలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - కంచికచర్ల : గొట్టుముక్కల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శుభం, జిల్లా వ్యవసాయాధికారి, అనిత భను, నందిగామ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ ఐ.కె శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కె.విజయ్ కుమార్, సిబ్బంది, ఊర్మిళ, ఉద్యావన శాఖ అధికారి నీలిమ, గ్రామీణ వ్యవసాయ సహాయకురాలు సంధ్య పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రీన్ అంబాసిడర్ల సేవలు మరువలేనివని మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న ఓ బొమ్మసాని శ్రీనివాసరావు మండల పరిధిలోని పనిచేస్తున్న 22 మంది గ్రీన్ అంబాసిడర్లకు శాలువాతో పుష్పగుచ్ఛం, వస్త్రాలు అందజేసి సన్మానించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2014 19 టీడీపీ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి. చెత్తను సేకరించి ఎందుకు కాను గ్రామాలలో పరిశుభ్రంగా ఉంచేలా గ్రీన్ అంబాసిడర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివై విష్ణు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రామారావు, టిడిపి నాయకులు మోహన మురళి రెడ్డి, రామినేని వీరాస్వామి నాయుడు, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

3 నుండి స్ఫూర్తి ట్రస్ట్ ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ విజయవాడ కార్యాలయంలో శ్రీ విశ్వమాత దసరా మహోత్సవాలు ఈనెల 3వ తేదీ నుండి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మిక విశ్వ గురువు ది సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు శ్రీ శ్రీ శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి అనుగ్రహంతో, ఆశీస్సులతో మధురానగర్‌లో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని తెలిపారు. వివరాలకు: 9246488678, 9866499691 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పరిధిలోని 11 కె.వి.గాంధీ బొమ్మ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు (2 గంటల) పాటు ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, కొళ్లఫారం రోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, ఐఒసి పెట్రోల్ బంక్ రోడ్డు, చర్చి రోడ్డు, గాంధీ బొమ్మరోడ్డు వరకు విద్యుత్ నిలిపి వేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ పి.రవీంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గౌతమ్ రెడ్డిని గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్లు) ఎన్నికల్లో వైసిపి బలపరిచిన పునూరు గౌతమ్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆయన స్వగృహం వద్ద మంగళవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.వైసిపి రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు. విజయవాడ కనకదుర్గ దేవస్థాన డైరెక్టర్ నంబూరి రవి, వైస్ చైర్మన్ ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, రాష్ట్ర ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు బద్దు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నాన్ని మహా నగరంగా తీర్చిదిద్దుతా : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం పట్టణాన్ని మహా నగరంగా తీర్చిదిద్దడానికి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావులతో కలిసి నగరంలోని 28వ డివిజన్లో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. 28వ డివిజన్లోని పచ్చమేడ సెంటర్లో గౌస్ మహమ్మదీన్ వికలాంగు పింఛన్, బీబీ జాన్ వద్ధాప్య పింఛన్, అదే డివిజన్లోని అమతపురంలో షాహీనా డయాలసిస్ పింఛన్, తాడంకి సంజీవరావుకు వద్ధాప్య పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయాన్నే పింఛన్లు అందించడంలో సచివాలయం ఉద్యోగులు, కూటమి నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. రాబోయే కాలంలో మేనిఫెస్టోలో తెలిపిన విధంగా సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని, దీనిలో భాగంగా ఈ దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో మచిలీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచటం, పారిశుధ్య నిర్వహణ, బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్ట్ ఏర్పాటు, పోర్టు నిర్మాణం వేగవంతం చేసి బందరు పట్టణాన్ని మహానగరంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని, బందరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, 28వ డివిజన్ ఇంచార్జ్ ఆరిఫ్, స్థానిక నాయకులు ఖదీర్, ఇలియాజ్, మాదివాడ రాము పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి రవీంద్ర

సిపిఎం అభిమాని వెంకట్రావమ్మ మృతి

ప్రజాశక్తి-ఉయ్యూరు: పెదఓగిరాలకు చెందిన సిపిఎం అభిమాని రావి వెంకట్రావమ్మ (85) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. ఆమె కుమార్తె ఆలపాటి ఉషారాణి కంకిపాడు సిపిఎం మండల కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. వెంకట్రావమ్మ భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కమిటీ

సభ్యులు మాదల వెంకటేశ్వరరావు పంచకర్ల రంగారావు, కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, మండల కమిటీ సభ్యులు చిక్కవరపు శ్రీహరి, వి.శివశంకర్, ఐద్వా మండల కార్యదర్శి గుర్రం కుమారి తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: బాపులపాడు మండలం వీరవల్లి ఆర్‌పిహెచ్ కాలనీ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ తన సొంత నిధులతో విద్యార్థులకు మంగళవారం భోజనం ఏర్పాటు చేశారు. పిల్లలకు రుచికరంగా నాణ్యమైన భోజనం అందించడం ద్వారా తరుచూ స్కూలు మానకుండా రావడంతో పాటు చదువుకునేందుకు మంచి ఉత్సాహాన్ని చూపిస్తారని తెలిపారు. వీరవల్లి మెయిన్ సెంటర్ ఎంపీపీ స్కూల్లో టీచర్ నాగమణి ఆర్థిక సహకారంతో భోజనం ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తెలిపారు.

ఎంఎల్ఎను కలిసిన ఎక్సైజ్ సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-గుడివాడ: ప్రజలందరికీ మంచి చేయాలన్న సంకల్పంతో సిఎం చంద్రబాబు నాయకత్వంలోనికూటమి ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం గుడివాడ ఎక్సైజ్ సిఐగా బాధ్యతలు చేపట్టిన పి. వెంకటరమణ, గుడివాడ, నందివాడ ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టిన హేమ సుష్మిత, ఆశాలతలు ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : రాము

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ప్రజా వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని డోకిపర్రు, పెంజేంద్ర గ్రామాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఎమ్మెల్యే రాము వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే రాము సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూరగడ్డ శ్రీకాంత్, చేకూరు జగన్ మోహన్‌రావు, శివప్రసాద్, సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, జోగి వెంకటేశ్వరరావు, పూరెల్ల శ్రీరాములు, చోరగుడి కోటేశ్వరరావు, జుజ్జువరపు మహా లక్ష్మణుడు, జయరాం, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ: డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియోపతి కళాశాలలో వరల్డ్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా గుడివాడ లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే రాము మంగళవారం ప్రారంభించారు. హోమియో విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణకు కూడా స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పెద్ది శ్రీకాంత్, చేవూరు జగన్‌మోహన్‌రావు, పోలసి ఉమా పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు పరిసర ప్రాంతాల్లో వరుసగా బైక్ దొంగతనాలు చేస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ముఠాను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉప్పులూరుకు చెందిన చింతపల్లి సాయికిరణ్, చిట్టి కళ్యాణం, దేవరపల్లి సందీప్, గిరిపురం కు చెందిన వక్కలగడ్డ రాకేష్ లు ముఠాగా ఏర్పడి బైక్‌లను దొంగిలిస్తున్నారు. ఈడుపుగల్లు శివారులో సంచారిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని విచారణ చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.సందీప్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4 వేలు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వృద్ధులకు సన్మానం

ప్రజాశక్తి-గన్నవరం: సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పుణ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా చినఆవుటపల్లి పుణ్య కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్, సమాజ సేవాతత్పరులైన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను దుశ్శాలువ, పూలమాలలతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ మనం తల్లిదండ్రులను ప్రేమించి, ఆప్యాయంగా ఆదరిస్తే, మన పిల్లలు మనల్ని ఆ విధంగా ఆదరిస్తారని చెప్పారు. బాలవర్ధన్‌రావు మాట్లాడుతూ వయసు శరీరానికి కానీ మనసుకు కాదని అన్నారు. తన వయసు 83 ఏళ్లు అని ఇప్పటికీ 60 ఎకరాల్లో సొంతంగా వ్యవసాయం చేస్తానని చెప్పారు. మంచి పుస్తకాలు చదువుతూనే ఉంటాను అన్నారు.

సీనియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణకుమార్ మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవటం మానవధర్మమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక విశ్లేషకులు గన్నే వెంకట్రావు, రీసెర్చ్ డైరెక్టర్ పీవీ.సత్యనారాయణ, టిడిపి నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, సీనియర్ సిటిజన్ మోతుర్కరి వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు వి.కామరాజు, జగదీశ్వరావు పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఆవుటపల్లి ఆర్‌సిఎం చర్చి ఆవరణలో ఉన్న వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

రక్తదాతలకు సత్కారం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో యకమూరు సుధీర్ టింబర్ డిపోలోని కాన్ఫరెన్స్ హాలులో రక్త దాతల అభినందన సత్కార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షులు నేరెళ్ల తేజ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరి నూకల వెంకట సాంబశివరావు, విశిష్ట అతిథిగా జోన్ చైర్ పర్సన్ యం.డి.ఇస్మాయిల్ పాల్గొన్నారు. లయన్స్ కార్యదర్శి నెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, వూర కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా పలుమార్లు రక్తదానం చేసిన, రక్తదానాన్ని ప్రోహించిన కె.శృతి, పామర్తి వెంకట తరుణ్ కుమార్, శిరిగినీడి నిఖిల్ సంజయ్‌లను లయన్స్ ప్రతినిధులు సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుంజూ స్వచ్ఛంద సంస్థలు, సామాజిక స్పృహ ఉన్న ప్రజలు రక్తదానాన్ని ప్రజా ప్రయోజన ఉద్యమంలా తరచూ నిర్వహించి ఉచిత రక్త పంపిణీ సంస్థలకు సహకారాన్ని అందించాలని సూచించారు. ఆరోగ్యవంతులైన, ఉత్సాహవంతులైన యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

సెక్యూరిటీ గార్డు నిజాయితీ

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు రామనగరంకు చెందిన రాజారావు మంగళవారం ఎస్‌బిఐ ఏటీఎం ద్వారా డ్రా చేసిన ఏడు వేల రూపాయలు మిషన్‌లో వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఇది గమనించిన సెక్యూటరీ గార్డు వేసపోగు డేవిడ్ ఆ మొత్తాన్ని బ్రాంచ్ మేనేజర్ వి.భారతికి అప్పగించిగా మేనేజర్ సిసి కెమెరాలను పరిశీలించి ఖాతాదారుడిని గుర్తించి నగదును అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీగా పని చేస్తున్న గార్డును బ్రాంచ్ మేనేజర్ భారతి, క్యాష్ ఆఫీసర్ కొల్లూరి కోటేశ్వరరావు అభినందించారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలో వేంచేసియున్న శ్రీలంకమ్మ అమ్మవారి దేవస్థానంలో మూడో తేదీ నుండి జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. మంగళవారం అవనిగడ్డలోని ఆయన స్వగృహంలో లంకమ్మ అమ్మవారి భక్త బృందం ప్రతినిధులు బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా దసరా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూనపరెడ్డి దుర్గా వెంకట పరుశురాం, హరిబాబు, ఎం పూర్ణ, పి శివరామకృష్ణ, జి అనిల్ కుమార్, ఎం శివరామకృష్ణ, మండలి సుధీర్, అన్నపురెడ్డి వెంకటేశ్వరరావు, యాసం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గాంధీ జయంతి

ప్రజాశక్తి-బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహాత్మాగాంధీ జయంతి నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ దేవజియరాజు అధ్యక్షతన చరిత్ర శాఖాధిపతి సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, హిమాలిని, సత్యరాజేష్, రామారావు, చలం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు రిలే దీక్షలు

దీక్షలో కూర్చున్న మధ్యాహ్న ఏజెన్సీ కార్మికులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో మధ్యాహ్న ఏజెన్సీ కార్మికుల దీక్షలు మంగళవారం నంది గామలో రెండో రోజుకు చేరాయి. ఎపి మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సి.హెచ్. సుప్రజ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కాకుండా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించే విధంగా ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించేవిగా ఉన్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, వేల్పుల ఏసోబు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐగా గురవయ్య

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్గా మంగళవారం బి గురవయ్య బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన మణికంఠ రెడ్డి తెనాలి బదిలీపై వెళ్లారు. పిఠాపురం నుండి గురవయ్య జగ్గయ్యపేట బదిలీపై వచ్చారు. ఈయన గతంలో జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ లో పనిచేశారు.**(ప్ర.వి.)**

మృతుని కుటుంబానికి నష్టపరిహారమివ్వాలి

విజయవాడ : విద్యుద్ఘాతంతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షలు అందజేయాలని సిపిఎం తూర్పు సిటీ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడ మొగల్రాజపురం చంద్ర రాజేశ్వరరావు నగర్ నివాసి సామల గోవింద్ వయస్సు (55) సిద్దార్ధ నగర్ 6వ లైన్ గౌతమీ అపార్ట్మెంట్లో వాచ్మెన్గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వాటర్ మోటారు వేయటానికి వెళ్లగా విద్యుద్ఘాతంతో మృతిచెందాడు. ఈ మేరకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందజేయాలని, విద్యుత్ శాఖ కూడా వెంటనే స్పందించి వారి ద్వారా వచ్చే నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి మైలవరం : ప్రభుత్వం విడుదల చేసిన నూతన మద్యం విధానం ప్రకారం రెండు సంవత్సరాల కాలవ్యవధిగానూ ప్రొ హిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మైలవరం 4, జి కొండూరు 4, రెడ్డిగూడెం 2 షాపులకు ఆసక్తి, అర్హత గల వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైలవరం ఎక్సైజ్ ఎస్ఐ జె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 షాపులకు లాటరీ పద్ధతిలో నిర్వహిస్తున్నారని ఆసక్తి గలవారు 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. లైసెన్స్ ఫీజు మైలవరం మండలానికి65 లక్షలు, జి కొండూరు మండలానికి 65, లక్షలు, రెడ్డిగూడెం మండలానికి రూ 55 లక్షలను జనాభా ప్రాతిపదికన నిర్ణయించడం జరిగిందన్నారు. లాటరీలో పాల్గొనదలచిన వారు 2 లక్షలు చెల్లించాలన్నారు. ఈనెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో లాటరీ తీయబడుతుందన్నారు.12 వ తేదీ నుండి నూతన మద్యం షాపులు అమల్లోకి వస్తాయని. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ గెజిట్, మైలవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దసరా సంబరాలు

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వ పాఠశాలలో మంగళవారం ఉదయం దసరా సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడపా నాగ సూర్యవతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సూర్యవతి మాటాడారు. **వత్సవాయి :** మండలంల్లోని ప్రాథమిక పాఠశాల చిన్న మోదుగుపల్లిలో దసరా పర్వదినం సందర్భంగా పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయురాలు ఎం.జయశ్రీ అంగన్వాడీ టీచర్స్ దేవకరణ విద్యార్థులు పాఠశాల యాజమాన్య కమిటీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్

మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ఆస్పత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారికి అందించే ప్రతి వైద్య సేవలోనూ బాధ్యతగా అన్ని స్థాయిల్లో ఆసుపత్రిలో సేవలందించాలని ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. హాస్పిటల్‌కి కావలసిన అవసరతలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం స్థానిక జగ్గయ్యపేట గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (ఆస్పత్రి)లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఛైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ హరికృష్ణ మెంబర్ కన్వీనర్ హోదాలో అజెండా అంశాలపై కమిటీకి నివేదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, హాస్పటల్ డెవలప్మెంట్ మెంబర్స్ ఎలమంచిలి వెంకటలక్ష్మి, పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు మరియు హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల పాలకులు వివక్ష

వృద్ధులను సన్మానించిన దృశ్యం

విజయవాడ : సమాజ జనాభాలో 60 శాతం పైగా వృద్ధులు ఉండగా వీరి కోసం ప్రత్యేక శాఖ లేకపోవడం బాధాకరమని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ, వికలాంగుల, హిజ్రాలతో కలిపి వృద్ధుల శాఖ ఉందని అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సమర యోధుల సంఘం ఆవరణలో జరిగింది. మహిళా బాలల, వికలాంగుల, కార్మికుల దినోత్సవం ప్రభుత్వ నిధులతోనే జరిగేవని కానీ నేడు ఆ పరిస్థితి లేదని అన్నారు. బ్యాంకుల్లో మూల్గుతూ ఉన్న ఎవ్వరూ క్లెయిమ్ చెయ్యని లక్షల కోట్ల ప్రజల సొమ్మును వృద్ధుల సంక్షేమం కోసం వినియోగించాలని అన్నారు. స్థానిక కార్పొరేటర్, విఎంసిలో టిడిపి పక్ష నాయకుడు నెలిబండ్ల బాలస్వామి డాక్టర్ సిఎల్ వెంకట్రావు, అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు మాట్లాడుతూ సంఘం 25వ వార్షిక వేడుకలు డిసెంబర్ 22 న సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్నట్లు తెలిపారు. వృద్ధుల హిజ్రాల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు, కామరాజు సర్వోదయ ట్రస్టు అధ్యక్షులు జి.వి.మోహన్ ప్రసాద్, సంఘం ప్రతినిధులు తొండేపు హనుమంతరావు, కామేశ్వరి మాట్లాడారు. అనంతరం 75 సంవత్సరాలు పైబడిన 13 మందిని సత్కరించారు. అందులో నందమూరు గ్రామానికి చెందిన 101 ఏళ్ల అడుసుమిల్లి వెంకాయమ్మ కూడా ఉన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాదెళ్ల సుమతీదేవి, కామేశ్వరి, నార్ల మాలతి, శ్రీరామ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జగ్గయ్యపేట ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలో ఎక్కువకాలం సర్వీస్ చేసి 83 సంవత్సరాల వయసు కలిగిన పిల్లి మత్తయ్య, తాళ్లూరి పెరుమాళ్లయ్యలను దుశ్శాలతో సత్కరించి వారిని కొనియాడారు. ఈ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు చిన్నమీరా, కార్యదర్శి నంబూరి చలపతిరావు, కోశాధికారి సీతారాం, కమిటీ సభ్యులు వై.మోహన్‌రావు, నోబెల్ భాష, టివి నారాయణ, యేసు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు: విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతల వివరాలను మంగళవారం కమ్యూనిటీ వైద్య అధికారి శ్యాంసుందర్, జెవివి జిల్లా కమిటీ సభ్యులు జి.మల్లికార్జున రెడ్డి తెలిపారు. మండల స్థాయిలో ప్రైవేటు విభాగంలో గీతాంజలి హైస్కూల్ మొదటి స్థానం, శ్రీ నారాయణ హైస్కూల్ రెండో స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ విభాగంలో మోడల్ స్కూల్ మొదటి స్థానంలో, కూనపరాజుపర్వ హైస్కూల్ రెండో స్థానంలో నిలిచాయి. ఈ నాలుగు టీంలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయని చెప్పారు. **గంపలగూడెం :** విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులకు చెకుముకి పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగాయి. మొత్తం 51 మంది పాల్గొనగా, ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రథమ, ద్వితీయ, ప్రైవేటు పాఠశాల నుండి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల కనుమూరు నుండి జి. లక్ష్మీ ప్రసన్న, కే చిన్నబాబు, జడ్పీ హైస్కూల్ గంపలగూడెం, లిటిల్ ఏంజిల్స్ శ్రీ గాయత్రీ పాఠశాల నుండి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. మండల జెవివి అధ్యక్షులు కె.శేషగిరి ఆధ్వర్యంలో నిర్వహించగా, తిరువూరు గంపలగూడెం మండలాల ప్రతినిధులు ఎం.సుధాకర్, సైదులు, పి.కొండలు, కోటేశ్వరరావు విజేతలకు ప్రోత్సాహకాలను అందజేశారు. **తిరువూరు :** విద్యార్థులలో శాస్త్రీయ దక్పథం పెంచడం, ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయడం కోసమే జనవిజ్ఞానవేదిక గత 30 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తుందని జనవిజ్ఞానవేదిక (జెవివి) జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థు లు19 టీమ్ లు ఈపోటీలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మునుకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మొదటి స్థానంలో కె లావణ్య టీమ్, ముష్టికుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.చాందిని టీమ్ ప్రయివేటు పాఠశాల విభాగంలో తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థిని ఎం.వీక్షిత టీమ్ ప్రథమ స్థానంలో, నాగార్జున పాఠశాల విద్యార్థిని హన్సిక టీమ్ ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచినట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు కడిమి పాపారావు తెలిపారు. జెవివి నాయకులు పి.శీనయ్య, డి.సుదర్శన్, ఎం.ఉషారాణి, సుభాని, ఈ. భరతకుమారి తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మంగళవారం స్థానిక గౌతమ్, ఆక్స్‌ఫర్డ్ ఎన్‌ఆర్‌ఐ పాఠశాలలో జరిగాయి. చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల కన్వీనర్ సురేష్ మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 12 టీములు పాల్గొన్నాయని అన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాల నుంచి 8, 9, 10 తరగతిలో మొదటి స్థానంలో విజేతలైన 16 జట్లు పాల్గొన్నాయి. ప్రభుత్వ పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయం, కొండపల్లి జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్, కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్, కొండపల్లి క్రాంతి హైస్కూల్, కొండపల్లి డి ఏ వి పబ్లిక్ స్కూల్, కొండపల్లి నాగార్జున ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారని జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు తెలిపారు. సభకు జే వి వి కొండపల్లి అధ్యక్షులు ఎస్.నాగరాజు అధ్యక్షత వహించారు. మండల ప్రజా పరిషత్ అభివద్ధి అధికారి బి.వి. రామకృష్ణ నాయక్ పాల్గొని మాట్లాడుతూ విజేతలను అభినందనలు తెలిపారు. మండల విద్యాధికారి చెరుకూరి పుష్పలత మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహణ వలన విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పోటీ తత్వం పెరుగుతుందన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్, ఉపాధ్యక్షులు పట్ల కామేశ్వరరావు, డాక్టర్ జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మస్తాన్ వలీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాదిక్, కొండపల్లి శాఖ కార్యదర్శి ఎస్‌కె సర్దార్ సాహెబ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట పట్టణం తపోవన్ విద్యాలయం విద్యార్థులు కెఇఎస్ఎస్ హర్షిత్ పదవ తరగతి, కె అమత 9వ తరగతి, ఎం యశ్వంతిని ఎనిమిదవ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మన సంస్కృతీ సంప్రదాయాలు, మన జీవన విధానాన్నీ ప్రతిబింబించే పండుగ, ప్రకృతిలో దొరికే పూలతో ఆనందంగా జరుపుకునే పండుగ, ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ పండుగ అని విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీమతి తన్నీరు సుధారాణి పేర్కొన్నారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని విజ్ఞాన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ తమ స్కూల్ నందు చదువుతో పాటు అన్ని మతాల పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ విద్యార్థులకు మత సామరస్యాన్ని అలవర్చు తామని తెలిపారు. బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు కేంద్రం మండల తహశీల్దార్‌గా రాజా కిషోర్ బదిలీపై వెళ్తున్న రాజా కిషోర్‌ను తోటి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. వీరులపాడు డిప్యూటీ తహశీల్దార్‌గా పద్మావతి నూతనగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆంజనేయులు గ్రామ రెవెన్యూ అధికారులు రమేష్ సయ్యద్ గౌస్, డి.వెంకటేశ్వరరావు సత్కరించారు.

ఎపి ఎస్‌డిఆర్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా రామారావు

ప్రజాశక్తి - విస్సన్నపేట : విజయవాడలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా ఎపి ఎస్‌డిఆర్‌ఎఫ్ అసోసియేషన్ ఎన్నికల్లో విస్సన్నపేట అగ్నిమాపక కేంద్రానికి చెందిన పివి.రామారావును ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పర్యావరణానికి మొక్కలు

ప్రజాశక్తి - గంపలగూడెం : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతున్నట్లు గంపలగూడెం ఉపాధి హామీ పనుల ఫీల్డ్ అసిస్టెంట్ మధు తెలిపారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ సమీపాన ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు కంపచెట్లను తొలగింపు పనులు చేస్తున్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - మైలవరం : కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వీర గాథ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 6వ వార్డులోని ఎంపిపి పాఠశాలలోని విద్యార్థులకు చిత్రలేఖనం, పద్యతోరణం, దేశభక్తి గేయాలు పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్ మాట్లాడుతూ చిన్నతనం నుండే కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూర్ బాషా సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా షేక్ బాబు

ప్రజాశక్తి - మైలవరం : జిల్లా నూర్ భాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా జి.కొండూరు గ్రామానికి చెందిన షేక్ బాబు నియమితులయ్యారు. మంగళవారం మైలవరంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూర్ భాషా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎస్కె కాజా రహంతుల్లా, కార్యదర్శి షేక్ ఖాసిం షరీఫ్‌లు బాబును జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమించినట్లు తెలిపారు. జి కొండూరు మండల నూర్ భాషా సంక్షేమ సంఘం అధ్యక్షులుగా షేక్ కొండబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూర్ భాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని వారుపేర్కొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఉయ్యూరు విద్యార్థులు

ప్రజాశక్తి-ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాల బాలికల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల కు ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఎంపికయ్యారు. ఈడుపు గల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పెనమలూరు నియోజ కవర్గ స్థాయి అండర్-14, అండర్ -17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీల్లో ఏడు విభాగా ల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి ఎంపికైన ట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ రమణ తెలిపారు. అండర్-14 విభాగం 400, మీటర్ల రన్నింగ్ పి. లక్ష్మీ హేమంత్ ప్రథమ, 200 మీటర్ల ద్వితీయ స్థానం సాధించా డు. జి.జీవన్ కుమార్ లాంగ్ జంప్ లో ద్వితీయ, ఎస్. రాజేశ్ 4మీటర్ల రిలే, ఎం.సాయిల క్ష్మి 400మీటర్ల రన్నింగ్ లో తతీయస్థానం, పి. ఖతీజ డిస్కస్త్రోలో తతీయ స్థానం సాధించారు. అండర్-17 విభాగం 400 మీటర్ల రన్నింగ్ ద్వితీయ స్థానం, పి.పవిత్ర 200 మీటర్ల రన్నింగ్ ద్వితీయస్థానం సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యా ర్థులు, వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జీవీ రమణ, జీఆర్ఎం లాల్ ను హెచ్ కె.జోత్స్నదేవి, వి ద్యాకమిటీ చైర్మన్ ఎ.శివసాయి ప్రసాద్, కమిటీ సభ్యులు అభినందించారు.

నలంద స్కూల్లో వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు: నలంద విద్యానికేతన్ వసంతా క్యాంపస్‌లో మంగళవారం దసరా, గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థలలో సిఎసిగా బాధ్యతలు నిర్వహిస్తున్న యల్.సుధారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులతో నిర్వహించిన ఆటల, పాటల పోటీలలో పెద్దలందరూ పాల్గొని తమ చిన్ననాటి అనుభవాలను గుర్తుకు చేసుకున్నారు. దసరా ఉత్సవంలో భాగంగా విద్యార్థులు నవదుర్గా మాతలుగా అలంకరించుకొని నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి జె. ప్రభురాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్చార్జి తహశీల్దార్‌గా లోకకుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా బి.లోకకుమార్ మంగళవారం

బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆయన బదిలీపై డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు తీసుకోగా తహశీల్దార్ నియామకం కాకపోవడంతో ఇన్‌ఛార్జ్ తాసిల్దార్‌గా లోకకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: తన తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని విద్యకు తన వంతు ప్రోత్సాహం అందిస్తున్నట్టు రిటైడ్ అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సాయన సుశీలరావు అన్నారు. మచిలీపట్నంలోని ఆర్కే కళాశాలలో మంగళవారం ఇద్దరు విద్యార్థినులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఆర్కే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శృతి, అలాగే లేడీ యాంప్తిల్ మహిళా కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న నఫీసాకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సాయన సుశీలరావు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు సాయన వీరభద్రయ్య -వీర రాఘవమ్మ చదువు పట్ల ఎంతో మమకారం చూపేవారన్నారు .వారి కషి పట్టుదలతోనే తాము విద్యావంతులమయ్యామన్నారు. అమ్మా నాన్నలను ఆదర్శంగా తీసుకొని విద్యకు తన వంతు సాయం అందిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ప్రతినెలా ఇరువురు పేద,

మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. ఇందుకవసరమైన నగదును సమకూర్చడంలో అమెరికాలో ఉన్న తమ కుమార్తె సాయన సంధ్య ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కే నరసింహారావు, కెమిస్ట్రీ హెచ్ఓడి ఎం.ఏసుపాదం, ఫిజిక్స్ విభాగాధిపతి పి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల బతుకుల్లో సంతోషం నింపుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం అవనిగడ్డ ఒకటో వార్డులో ఉదయం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎలవర్తి ఆది అడపా వెంకటేశ్వరరావు, గాలం శ్రీను, కంచర్ల ఆనంద్, కర్ర సుధాకర్, గుడివాక పద్మ పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ (గన్నవరం):** బాపులపాడు మండలం ఎంజీ.నగర్, తారకరామనగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ముఖంలో నవ్వు చూడాలని, వారి ఆర్థిక ఇబ్బందులను కొంతమేరకైనా తగ్గించాలనే లక్ష్యంతో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులకు యార్లగడ్డ తన సొంత నిధుల నుండి నగదు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టా సురేష్, వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివ అప్పారావు, ముల్పూరి సాయి కళ్యాణి, గుండపనేని ఉమప్రసాద్, వీరమాచినేని సత్యప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకష్ణ , వేములపల్లి శ్రీనివాస్, దన్నే దుర్గారావు, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, చలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యానికి గురైన మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు ను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగినేని భాస్కరరావు చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో గ్రామ ప్రముఖులు, సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపిటిసి సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, కసుకుర్తి అర్జునరావు పింఛన్లు అందజేశారు.

నిరుపేద కుటుంబానికి బివిఆర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు: నిరుపేద కుటుంబానికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం బీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ట్రస్టు చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి మంగళవారం అందచేశారు. ఆకివీడు నుంచి వచ్చి వల్లూరురోడ్డులో ఓ భవనం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సురేశ్ తన కుమార్తె డెలివరీకి అవసరమైన డబ్బులేక ఇబ్బంది పడుతున్న పరిస్థితు ల్లో ఆర్థిక సాయం చేయాలని ట్రస్టును కోరాడు. స్పందించిన వెంకటరెడ్డి మానవ సేవే మాధవ సేవగా భావించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, ఆరేపల్లి రమేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-చల్లపల్లి

ఐసిడిఎస్ మొవ్వ పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న సహాయకురాలు పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తుల కోరుతున్నట్లు సమగ్ర శిశు సేవ పథక అధికారిణి డి సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఘంటసాల మండలం చిట్టూరు మగ్గాలమాలపల్లి 4, మొవ్వ 5 కేంద్రం ఎస్సీలకు, తాడేపల్లి 1, కాజా 4 బిసి-బిలకు చల్లపల్లి 4 (నిమ్మల తోట) చల్లపల్లి 10, మొవ్వ 3, పెద్ద ముత్తెవి 1 ఓసీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. అంగన్వాడి సహాయకుల పోస్టులకు దరఖాస్తులు చేసే వారు యు అభ్యర్థులు వివాహితులై, స్థానికలై ఉండవలెను. ఆరు నెలలు దాటని నివాస పత్రం డోర్ నెంబర్ తో సహా ఉండాలని, 1-07-24 నాటికి 21 సంవత్సరముల నుండి 35 సంవత్సరాల వయసు లోపు కలిగి ఉండాలని, పదో తరగతి పాస్ అయిన వారు అర్హులలని, దరఖాస్తు చేయు అభ్యర్థులు ఒరిజినల్ దరఖాస్తు రెండు కాపీలు ఫోటోలు జత చేయాలని తెలిపారు. నివాస ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డ్,రేషన్ కార్డ్ ఒక్కొక్కటి రెండు కాపీలు గెజిటెడ్ ఆఫీసర్‌చే ధ్రువీకరించబడినవి జత చేయాలన్నారు. దరఖాస్తులను ఈ నెల పదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు స్వయంగా సమగ్ర శిశు సేవ పథక అధికారిణి, ఐసిడిఎస్, మొవ్వ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలకు నష్టపరిహారం ఇప్పించాలని తహశీల్దార్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని, ఎకరాలకు రూ.25 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని, ఈకేవైసీ చేయించి బీమా పథకాన్ని రైతులకు, కౌలు రైతులకు వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, లంకదాసుల అజయ్ ఘోష్, పుప్పాల నరసింహారావు, పి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ... విద్యుత్ చౌర్యం

ప్రజాశక్తి-పెడన: మండల పరిధిలోని దిరిసివల్లి గ్రామానికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకురాలు భర్త అదే గ్రామంలోని ఎకరం 20 సెంట్లు కలిగిన ఈ చెరువును ఆక్రమించుకున్నాడు. ఈ చెరువుకు గత 2018-19లోనే ఏడాదికి 24 వేల రూపాయలు వేలంపాట ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పలికిందని అధికారుల రికార్డులు చెబుతున్నాయి. దీనిపై కన్నేసిన సదరు ద్వితీయ శ్రేణి నాయకురాలి భర్త పార్టీ అధికారంలో ఉండటంతో గత నాలుగేళ్లుగా ఎలాంటి వేలం పాటలు నిర్వహించకుండా యదేచ్ఛగా చేపలు, రొయ్యలను సాగు చేసుకుంటున్నాడు. ఇదంతా చూస్తున్న పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు నెలవారి మామూలు అందడంతో పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అదే గ్రామానికి చెందిన నాయకులు దీనిని తెరపైకి తీసుకొచ్చారు. దీంతో చేసేది లేక సదరు ద్వితీయ శ్రేణి నాయకురాలు భర్త పలు రకాలుగా పావులు కదుపుతున్నాడు. అయితే గత ఐదు ఏళ్లుగా ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకపోవడంతో రెండు లక్షల పైగా పంచాయతీ ఆదాయానికి గండి కొట్టడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడింది. అంతేకాకుండా ఐదేళ్లుగా విద్యుత్ మీటర్లు లేకుండానే నాలుగు మోటర్లు, ట్యూబ్ లైట్లు, ఏరియేటర్లు లాంటివి ఏర్పాటు చేయడంతో లక్ష రూపాయల్లో విద్యుత్ చోర్యం జరిగినట్లు తెలుస్తుంది.



పట్టించుకోని అధికారులు

గత వైసిపి ప్రభుత్వంలో ద్వితీయ శ్రేణి నాయకులు ఎలాంటి అక్రమాలకు పాల్పడినప్పటికీ క్రింది స్థాయి సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి దుస్థితి దాపురించిందని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీరిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు ఈ విషయంపై ఈఓఆర్డి జయరాం ను వివరణ కోరగా గత నాలుగేళ్లుగా ఆ పంచాయతీలోని ఆ చెరువును వేలంపాట నిర్వహించడం లేదని రికార్డుల్లో ఉందన్నారు వీటిపై గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి వివరణ ఇవ్వాలి అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలను వివరణ కోరగా త్వరలోనే వెళ్లి వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నత విద్యా కోర్సులతో విదేశాల్లో ఉపాధి

మాట్లాడుతున్న డాక్టర్ గాడ్రెడ్డి బుచస్విలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విదేశాలలో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇవ్వనున్నారని జార్జియా హయ్యర్ అండ్ జనరల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ గాడ్రెడ్జి బుచస్విలి అన్నారు. గాయత్రినగర్‌లోన పివిఆర్ టవర్స్‌లో ఎస్ఇయు జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ ప్రాంతీయ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం విదేశాలలో ఉన్నత విద్యావకాశాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఎస్ఇయు యూనివర్సిటీ అగ్రభాగాన ఉందని, ఇక్కడ వైద్య విద్యతో పాటు పలు ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్, నర్సింగ్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫైనాన్స్, న్యూట్రిషన్, డెంటల్, ఎంబిఎ కోర్సులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులు స్కాలర్‌షిప్ కూడా అందిస్తారని అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌విక్టా కెరియర్ కన్సల్టెన్సీ ప్రయివేట్ లిమిటెడ మేనేజింగ్ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నూతనంగా ఎస్ఇయు జార్జియా యూనివవర్సిటీ ప్రాంతీయకేంద్రాన్ని విజయవాడ, హైదరాబాద్‌లో ప్రారంభించామని తెలిపారు. జార్జియాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు డైరెక్టుగా యూనివర్సిటీ కేంద్రం ద్వారా సంప్రదించి అడ్మిషన్ పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చిరాగ్ వాగేలా, ఇన్‌విక్టా డైరెక్టర్ కె.ఎస్.కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడఅర్బన్ : శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించ నున్నట్లు కమిటీ చైర్మన్ సిఎ సుంకర అక్కయ్యనాయుడు, జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ ప్రసన్న తెలిపారు. నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఉదయం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శత చండీహోమం, రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల విషయంలో దేశంలోనే విజయవాడ నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు విజయవాడకు ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తుందన్నారు. సామాన్య యాత్రికులు సైతం చండీ హోమం, కుంకుమార్చన లాంటి మహోన్నత కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కమిటీ వారు ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బ్రహ్మ రాళ్లపల్లి, పవన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొల్లి హారిక, కార్యవర్గ సభ్యులు చారుగుండ్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకూ శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్‌లు చెప్పారు. ఈ సందర్భంగా కేబీఎన్ కళాశాల కమిటీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ తమ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానం వేదికగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమిటీ అధ్యక్షులు టి.శేషయ్య మాట్లాడుతూ తొమ్మిదో తేదీన విద్యార్థుల చేత మహాసరస్వతీ పూజను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల కోశాధికారిత హరగోపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మేధోవికాసం జరగాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు దుగ్గి రామకిషోర్, వైస్ ప్రిన్సిపాల్ కే. రామకష్ణ పాల్గొన్నారు.

వృద్ధుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - భవానీపురం : గుర్తు తెలియని ఓ వృద్ధుని మృతదేహం మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు గుర్తు తెలియని మగ మృతదేహం 52-55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండొచ్చని తెలిపారు. ఈ వృద్ధుడు సితార సెంటర్‌లోని ప్రభుత్వ వైన్ షాపు వద్ద పడివున్నాడు. స్థానికుల సమాచారం మేరకు భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గుర్తు తెలియని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

జగ్గయ్యపేట: మహిళ మెడలో చైన్ అపొరించిన సంఘటన చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుమంచిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన మహిళ పానుగంటి రత్తమ్మ వద్ధాప్య పెన్షన్ తీసుకొని నందిగామ లో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్ళుటకు విజయవాడ వెళ్లే రోడ్ లో బస్ కోసం నిలబడి ఉంది. హైదరాబాదు నుండి విజయవాడ వెళ్తున్న కారు ఆమె సమీపంలో ఆపి మెడలో ఉన్న 25 గ్రాములు సుమారు రెండు లక్షల రూపాయలు విలువైన చైను తెంచుకొని కారులో పరారయ్యారు. బాధితురాలు రత్తమ్మ చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద సాయంలో విఫలం

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు పరిహారం విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమని సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు.ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వరద బాధితులను ఈ ప్రభుత్వం నిండా ముంచిందని.. ముఖ్యంగా సర్వే వివరాలు పొంతన లేవన్నారు. ఈ నెల 4 లోపు మరలా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కంచికచర్ల : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందిగామలో జరిగిన నందిగామ నియోజకవర్గ ఆటల పోటీల్లో కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ విద్యార్థులు మంచి క్రీడ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.రంగారావు మంగళవారం తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు అండర్ 17 కబడ్డీ విభాగంలో టి.హేమలత. డి.సందీప్ అండర్ 17 వాలీబాల్ విభాగంలో టి.ఎలియజర్ అండర్ 14 వాలీబాల్ విభాగంలో పి.నాగేశ్వరరావు అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో కె.జస్వంత్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను వీరికి తర్ఫీదు నిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ కె.ఎ.గఫార్ ఖాన్‌లను గ్రామ సర్పంచ్ తుల్లి మల్లి రాజకుమార్ విద్యా కమిటీ చైర్మన్ పి.గోపాలం కో ఆప్షన్ నెంబర్ గోగినేని శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ గ్రామస్తులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరువూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి పోటీలకు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అండర్ 17 చెస్‌లో షేక్ సమీనా ఫస్ట్ ప్లేస్, అండర్ 14 డిస్కస్ త్రో మయూరి ఫస్ట్ ప్లేస్, అండర్ 17లో నేహా ఆజ్మి, జావిలిన్, షాట్ పుట్ డిస్కస్ త్రోలో దీపిక, అండర్ 14లో లాంగ్ జంప్ ఫస్ట్ ప్లేస్, 200 మీటర్స్ లాంగ్ జంప్ వైష్ణవి సెకండ్ ప్లేస్, యోగాలో అండర్ 14 ఇందుప్రియ, శృతి, అఖిల, అండర్ 17లో లాస్య, అఫ్సానా షటిల్ అండర్ 14 మయూరి అండర్ 17 అప్సానా వాలీబాల్ అండర్ 14, అండర్ 17 ఐదుగురు, ఖోఖో అండర్ 17, అండర్ 14 ముగ్గురు, కబాడీ అండర్ 14, అండర్ 17 విభాగంలో ఇద్దరు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

ఎస్‌జిఎఫ్ఐ క్రీడలకు ఎంపిక

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల తిరువూరులో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయికి తమ పాఠశాల విద్యార్థినులు ఖోఖో క్రీడకు ఎంపికైనట్లు నెమలి జడ్‌పి హైస్కూల్ పిఈటి మౌనిక తెలిపారు. అండర్ 17 విభాగంలో టి కీర్తి, ఈ గంగోత్రి, కె.నందిని ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రం అభినందించారు.

కరాటే పోటీల్లో శ్రీనిధి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- తిరువూరు : ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో తిరువూరు శ్రీనిధి స్కూల్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వెంకట నారాయణ తెలిపారు. సెప్టెంబర్ 29వ తేదీన మిర్యాలగూడలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్-ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్, సుమన్ షోటో ఖాన్ కరాటే ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ స్టేడియం లో నిర్వహించిన ఛాంపియన్ షిప్ పోటీలలో శ్రీనిధి స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి గోదా రోహన్ పునీత్ కుమితే విభాగంలో తృతీయ స్థానం సాధించాడని తెలిపారు. విజేతగా నిలిచిన విద్యార్థి రోహన్ పునిత్‌ను పాఠశాల కరెస్పాండెంట్ ముత్యాల కిషోర్ బాబు, హై స్కూల్ విభాగం ఇన్ చార్జ్, ఫిజికల్ డైరెక్టర్ సునీల్, ప్రైమరీ ఇంచార్జ్ పద్మావతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు. కోచ్‌ను అభినందించారు.

గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ నూతన ఉత్పత్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 సందర్భంగా నూతన ఉత్పత్తులను అవిష్కరించినట్లు సంస్థ ఏరియా ప్రతినిధి ఎన్.ఎం.కుమార్ తెలిపారు. నగరంలోని అమెజాన్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. అమెజాన్ సెల్లర్ ప్రోగ్రామ్‌లు కరిగర్, సహేలీ, లోకల్ షాప్స్, లాంచ్‌ప్యాడ్‌లో భాగమైన ఎస్ఎంబిల ద్వారా 9,500 పైగా కంటే ఎక్కువ కొత్త ఉత్ప త్తులు ఆవిష్కరించ బడ్డా యని తెలిపారు. అల్విన్నో, ఫూల్, ఆజోల్, తాషా క్రాఫ్ట్, ఇతర బ్రాండ్‌లు అమెజాన్ డాట్ ఇన్ లో తమ ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయని తెలిపారు.

పోలీస్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ది బెజవాడ బార్ అసోసియేషన్‌లో పోలీస్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా ఇబ్రహీంపట్నానికి చెందిన సీనియర్ న్యాయవాది ధరణికోట శ్రీనివాసరావును ది బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నియమించారు. ఈ సందర్భంగా ధరణికోట శ్రీనివాసరావు మాట్లాడుతూ 1906వ సంవత్సరంలో ఆవిర్భవించిన నాటి నుండి ఎంతో ఘన చరిత్ర కలిగిన బెజవాడ బార్ అసోసియేషన్ పోలీస్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా తనకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని కల్పించిన ది బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

నూతన ఉత్పత్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వినియోగదారులు ఇంట్లోనే సినిమాలు చూసి ఆస్వాదించేలా సోనీ ఆధ్వర్యంలో సినిమా ఈజ్ కమింగ్ హోమ్ కాన్సెప్ట్‌తో నూతన ఉత్పత్తులు ఆవిష్కరించినట్లు సోనీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ సయ్యర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సోనీహోమ్ థియేటర్ నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోనీ బ్రావియా అతి పెద్ద ఎల్ఇడి టివిలతో పాటు నూతన ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేసినట్లు తెలిపారు. ఇవి వినసొంపైన ధ్వనితోపాటు చక్కగా చూసి ఆనందించవచ్చని తెలిపారు. రానున్న పండుగల సందర్భంగా వీటిని అన్ని ప్రాంతాలకు విస్తరించే విధంగా ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

విజయ భారతి సంతాప సభ

ప్రజాశక్తి-విజయవాడ : ప్రముఖ రచయిత్రి, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ప్రజలకు అందుబాటులో తెచ్చిన డాక్టర్ బోయి విజయ భారతి సంతాప సభ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగింది. కార్యక్రమానికి గోళ్ళ నారాయణరావు అధ్యక్షతన వహించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి , మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్ , కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, జి.నటరాజు, సీహెచ్ శ్రీనివాస్ , జైభీంభారత్ పార్టీ నాయకులు జి కొండలరావు , పరసా సురేష్ , ఎస్‌సి, ఎస్ టి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గోసాల మురళీకష్ణ, ప్రధాన కార్యదర్శి రత్న ప్రదీప్, డాక్టర్ అంకయ్య, షాలేం రాజు, గంజి రామారావు, తిమూతి, లక్ష్మినారాయణ, రంగారెడ్డి, శ్యాంబాబు, సుబ్రహ్మణ్యం, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.ముందుగా విజయ భారతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆనాటి వర్ణాశ్రమం , కులవివక్ష కు వ్యతిరేకంగా రాసిన తన రచనలు ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. బోయి భీమన్న కూతురు, బొజ్జ తారకం భార్య అయిన విజయ భారతి మన మధ్య లేకపోవడం తీరని లోటని పలువురు సంతాప సభలో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.